క్లుప్తంగా

కలెక్టర్‌కు సన్మానం


కలెక్టర్ జితేష్ వి పాటిల్‌ను సత్కరించిన జోషీ

పాల్వంచ రూరల్: జగన్నాథపురం వాసీ జిల్లా ప్రాంతీయ రవాణా అథారిటీ సభ్యులు బాదర్ల జోషీ కలెక్టర్ జితేష్ వి పాటిల్‌ను శనివారం సన్మానించారు. అనంతరం నిరుపేద విద్యార్థుల కోసం నోట్ పుస్తకాలను కలెక్టర్‌కు అందజేశారు. ప్రభుత్వం ద్వారా వచ్చిన ఆర్‌టీఏ సభ్యులుగా నియమిస్తూ జారీచేసిన జీవో కాపీని కలెక్టర్‌కు జోషీ అందజేసినట్లు తెలిపారు.

అదనపు గదులు ప్రారంభం


గదులను ప్రారంభిస్తున్న జీఎం కృష్ణయ్య

ఇల్లెందు: గార్లలోని బంజారా సేవా సమితీ ఆధ్వర్యంలో సాగుతున్న స్కూల్ అదనపు గదులను ఏరియా జీఎం వీసం కృష్ణయ్య శనివారం ప్రారంభించారు. సీఎండీ బలరాం ఆదేశాల మేరకు అదనపు గదులు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో డీజీఎం పర్సనల్ తుకారం, డీజీఎం సివిల్ రవికుమార్, వెంకటేషం, అజయ్, జోగిరాం తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ ఉద్యోగుల రోస్టర్ రికార్డుల పరిశీలన

ఇల్లెందు: సింగరేణి ఇల్లెందు ఏరియాలో వివిధ విభాగాల్లో పనిచేస్తున్న ఎస్సీ ఉద్యోగుల రోస్టర్ రికార్డులను చీఫ్ లైజనింగ్ ఆఫీసర్ డి.రాంచందర్, కమిటీ సభ్యులు రాజేశ్వరరావు, వెంకటేశ్వరరావు, నాగేశ్వరరావు, తిరుపతి, శ్రీనివాసరావు శనివారం ఇల్లెందు జీఎం కార్యాలయంలో పరిశీలించారు. ఎస్సీడబ్ల్యూఏ ఉద్యోగుల ఏరియా స్థాయి అంతర్గత నియమకాలు పదవుల్లో షెడ్యూల్ క్యాస్ట్ రిజర్వేషన్ నియామకాలు అమలుకు సంబంధించిన రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా లైజనింగ్ టీం సభ్యులను ఏరియా జీఎం వి.కృష్ణయ్య స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో డీజీఎం పర్సనల్ జీవీ మోహన్‌రావు, ఎస్‌ఓటూ జీఎం రామస్వామి, ఎస్సీ ఉద్యోగుల సంఘం ప్రతినిధులు పాల్గొన్నారు.

సీఆర్‌టీ మృతిపై ఎమ్మెల్సీ, ఎమ్మెల్యే సంతాపం


మంగీలాల్ (ఫైల్)

టేకులపల్లి: మండలంలోని లచ్చతండాకు చెందిన సీఆర్‌టీ బానోతు మంగీలాల్ (36) అనారోగ్యంతో కన్నుమూశాడు. ఇరవై ఏళ్లుగా సీఆర్‌టీగా పనిచేస్తున్న ప్రస్తుతం ఇల్లెందు మండలం బొజ్జాయిగూడెం ఆశ్రమ పాఠశాలలో విధులు నిర్వర్తిస్తున్నాడు. ఇటీవల కేన్సర్ బారిన పడగా చికిత్స చేయిస్తుండగానే శనివారం మృతి చెందాడు. ఆయనకు మృతుడికి భార్య మానస, ఓ కుమార్తె ఉన్నారు. కాగా, మంగీలాల్ మృతదేహం వద్ద టీచర్ ఎమ్మెల్సీ పింగిలి శ్రీపాల్‌రెడ్డి, ఎమ్మెల్యే కోరం కనకయ్య నివాళులర్పించి కుటుంబ సభ్యులను పరామర్శించారు. పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు పూనెం నర్సయ్యతోపాటు రవీందర్, మోతీలాల్, బాలాజీ, శంకర్, పూన్యా, రెడ్యా నాయక్, చందర్‌సింగ్, గుండా నరసింహారావు, కోరం సురేందర్ తదితరులు పాల్గొన్నారు.

ఆగిన సీసీ రోడ్డు నిర్మాణం


పనులు నిలిచిపోయిన రోడ్డు

పాల్వంచరూరల్: కేటీపీఎస్ అధికారుల అభ్యంతరంతో సీసీ రోడ్డు ఆగిపోయింది. మండల పరిధిలోని కిన్నెరసాని గ్రామశివారు రూరల్ పోలీసుస్టేషన్ ఎదుట నుంచి శ్రీ రామాంజనేయస్వామి ఆలయం వరకు రూ.18 లక్షల వ్యయంతో సీసీ రోడ్డు మంజూరైంది. రోడ్డు నిర్మించే క్రమంలో అనుమతి లేకుండా వారి పరిధిలో రోడ్డును ఏలా నిర్మిస్తారని కేటీపీఎస్ అధికారులు అభ్యంతరం వ్యక్తం చేయడంతో రోడ్డు నిర్మాణం జరగకుండా నిలిచిపోయింది. ఈ మేరకు సమస్యను ఏఈతోపాటు స్థానికులు ఎమ్మెల్యే కూనంనేని దృష్టికి తీసుకవెళ్లగా స్పందించిన ఎమ్మెల్యే కేటీపీఎస్ అధికారులతో తాను మాట్లాడి సమస్యను పరిష్కరిస్తామని చెప్పినట్లు సంబంధిత అధికారి తెలిపారు.

ముదురుతున్న మార్కెట్ వివాదం

మున్సిపల్ మార్కెట్ నిర్మాణానికి అడ్డంకులు
- శంకుస్థాపన చేసిన తరువాత మెలికపెట్టిన సింగరేణి
- వ్యాపారులు, సెక్యూరిటీ నడుమ వాగ్వాదం
- సీఅండ్‌ఎండీ దృష్టికి తీసుకెళ్లిన ప్రజాప్రతినిధులు


మున్సిపల్ మార్కెట్ షెడ్ల నిర్మాణం జరుగుతున్న స్థలం

కొత్తగూడెంఅర్బన్: కొత్తగూడెం రైతుబజార్ ఎదురుగా ఉన్న మున్సిపల్ ప్రైవేట్ మార్కెట్ నిర్మాణ పనులు వివాదాస్పదంగా మారాయి. మున్సిపల్ మార్కెట్‌కు సంబంధించి సీఎస్ఆర్ నిధులతో 40 షెడ్లను నిర్మించడానికి ఇటీవల ఎమ్మెల్యే శంకుస్థాపన చేయగా పునాదులు కూడా తవ్వారు. సమాచారం అందుకున్న సింగరేణి అధికారులు సెక్యూరిటీ అధికారులను, సిబ్బందిని నిర్మాణ స్థలం దగ్గరకు శుక్రవారం పంపించి సింగరేణి స్థలం అంటూ బోర్డులు పెట్టే ప్రయత్నం చేశారు. దీంతో మున్సిపల్ ప్రైవేట్ మార్కెట్ వ్యాపారులు, సింగరేణి సెక్యూరిటీ విభాగం అధికారుల నడుమ వాగ్వాదం జరిగింది. పనులు జరుగుతున్న నేపథ్యంలో బోర్డులు పెట్టడానికి వీలు లేదని, విషయం ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లామని, ఆయన ఊరిలో లేరని వచ్చాక ఆయన నిర్ణయం మేరకు ఎవరి పని వారు చేసుకుందామని వ్యాపారులు తేల్చి చెప్పారు. అనంతరం సింగరేణి సెక్యూరిటీ వారు అక్కడి నుంచి వెళ్లిపోయారు.


వ్యాపారులు, సింగరేణి సెక్యూరిటీ నడుమ వాగ్వాద దృశ్యం (ఫైల్)

గతంలోనే నిర్మించి ఉంటే..

పట్టణంలోని తాత్కాలిక రైతుబజార్ ఎదురుగా 2023–24 సంవత్సరంలో మున్సిపల్ ప్రైవేట్ మార్కెట్ వ్యాపారుల కోసం 66 షెడ్లు నిర్మించి ఇచ్చినప్పుడే మిగిలిన 40 మంది వ్యాపారులకు కూడా షెడ్లు నిర్మించి ఉంటే ప్రస్తుతం ఈ గొడవలు తలెత్తే అవకాశం ఉండేది కాదు. కానీ విడతల వారీగా నిర్మాణం చేయడంతో స్థల వివాదం తలెత్తింది. అయితే నిర్మాణమయ్యి ప్రస్తుతం వ్యాపారం మాత్రం 66 షెడ్లలో ప్రతీ రోజూ కేవలం 15 మంది మాత్రమే వ్యాపారం చేస్తున్నారని, మిగిలినవి ఖాళీగా ఉంటున్నాయని కొంత మంది అభిప్రాయపడుతున్నారు. అయితే కొత్తగా నిర్మించనున్న 40 షెడ్లు నిర్మాణమయ్యే వరకు కూడా 40 మంది ఖాళీగా ఉన్న షెడ్లలో వ్యాపారం చేసుకుంటే కొంత ఆసరాగా ఉండే అవకాశం ఉంటుంది. అయితే ప్రస్తుతం వ్యాపారులంతా కలిసి వారి సమస్యను ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లడంతో సమస్యను పరిష్కరించేందుకు సీఅండ్‌ఎండీతో ఎమ్మెల్యే మాట్లాడినట్లు సమాచారం. సమస్య పరిష్కారమయితే షెడ్ల నిర్మాణం కొనసాగుతుంది. లేకుంటే ఆ స్థలం చుట్టూ సింగరేణి వారు ఫెన్సింగ్ వేసే అవకాశం ఉంటుంది. ఇంత జరుగుతున్నా రైతుబజార్‌కు సంబంధించి ఇంటిగ్రేటెడ్ మార్కెట్ నిర్మాణ పనులు ఏళ్ల తరబడిగా సాగుతూనే ఉన్నాయి. పనులు పూర్తికాకపోవడంతో రైతులు తాత్కాలిక షెడ్లలో తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నారు. ఇంత వరకు కూడా మరమ్మతుల పనులు చేపట్టకపోవడంతో ఈ వర్షాకాలంలో రైతుబజార్ తాత్కాలిక షెడ్లలో వ్యాపారం చేసుకునే వారికి అవస్థలు తప్పే విధంగా కనిపించడం లేదు.

వ్యాపారం బంద్ కావడంతో అవస్థలు..

ఇదిలా ఉండగా నిర్మాణాన్ని అడ్డుకొని బోర్డులు ఏర్పాటు చేస్తే, కూరగాయాలు అమ్ముకోవడానికి వారి గూడు ఉండదని, కుటుంబాలతో రోడ్డున పడతాయని వ్యాపారులంతా శనివారం సీపీఐ కార్యాలయానికి వెళ్లి వారి గోడును వెళ్లబుచ్చుకున్నారు. సింగరేణి స్థలం అంటూ బోర్డులు పెడితే షెడ్ల నిర్మాణ పనులు నిలిచిపోయి జీవనాధారం కోల్పోవలసి వస్తుందని, ఇప్పటికే మూడు వారాలుగా దుకాణాలు పెట్టుకోకపోవడంతో వ్యాపారం కోల్పోయి ఇబ్బందులు పడుతున్నామన్నారు. ఇంకా నిర్మాణ పనులు జాప్యం జరిగితే ఆర్థిక ఇబ్బందులు ఎక్కువవుతాయని వ్యాపారులు ఆవేదన వ్యక్తం చేసినట్లు సమాచారం.

నిర్మాణ పనులు జరగనివ్వాలి



మున్సిపల్ ప్రైవేట్ మార్కెట్‌లో 40 షెడ్ల నిర్మాణానికి పనులు జరుగుతుంటే సింగరేణి అధికారులు వారి స్థలం అంటూ అడ్డుచెప్పడం సరికాదు. ఎమ్మెల్యే షెడ్ల నిర్మాణానికి శంకుస్థాపన కూడా చేశారు. ఇప్పటికే మూడు వారాలుగా వ్యాపారులు, వ్యాపారం చేసుకునే అవకాశం లేక ఇబ్బందులు పడుతున్నారు. నిర్మాణ పనులు ఇంకా ఆలస్యం అయితే వ్యాపారులకు ఆర్థిక ఇబ్బందులు ఎక్కువవుతాయి. నిర్మాణ పనులు జరిగేందుకు అందరూ సహకరించాలి.

– రెహమాన్, మున్సిపల్ మార్కెట్ సెక్రెటరీ

రాజీపడితే ఇరువర్గాలు గెలిచినట్టే..


మాట్లాడుతున్న జడ్జి కీర్తి చంద్రిక రెడ్డి

ఇల్లెందు: జాతీయ లోక్ అదాలత్‌లో ఇరువర్గాలు రాజీపడితే ఇరువర్గాలు గెలిచినట్టేనని ఇల్లెందు కోర్టు న్యాయమూర్తి దేవరపల్లి కీర్తి చంద్రికారెడ్డి అన్నారు. ఈ మేరకు శనివారం ఇల్లెందు కోర్టులో లోక్ అదాలత్‌ను ప్రారంభించారు. కక్షిదారులు క్షణికావేశంలో పెట్టుకున్న కేసుల్లో ఇరువర్గాలు కోర్టుకు వచ్చి రాజీపడితే ఇరువురు గెలిచినట్లు అవుతుందన్నారు. పెద్ద మనుషుల సమక్షంలో జరిగే పంచాయతీలకు చట్టబద్ధత ఉండదన్నారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షులు ఉమా మహేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి కీర్తి కార్తీక్, సీనియర్ న్యాయవాదులు పెద్దూరి వెంకటనర్సయ్య, పప్పులు గోపీనాథ్, దంతాల ఆనంద్, ఎస్.వెంకటేశ్వర్లు, జూనియర్ న్యాయవాదులు, పోలీస్, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

వాగ్దానాలు నెరవేర్చే వరకు ఊరుకోం


మాట్లాడుతున్న వనమా

సూపర్‌బజార్(కొత్తగూడెం): ఎన్నికల సమాయంలో కాంగ్రెస్ పార్టీ ప్రజలకు ఇచ్చిన ఆరుగ్యారంటీలు, 420 వాగ్దానాలను నెరవేర్చేవరకు కాంగ్రెస్ ప్రభుత్వాన్ని నిద్రపోనివ్వమని మాజీ మంత్రి వనమా వెంకటేశ్వరరావు అన్నారు. బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు రేగా కాంతారావు అధ్యక్షతన జిల్లా పార్టీ కార్యాలయంలో శనివారం జరిగిన పార్టీ మండల, పట్టణ అధ్యక్షుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పాలన అస్తవ్యస్తంగా ఉందని విమర్శించారు. సీతారామ ప్రాజెక్టు నీళ్ల విషయంలో జిల్లాకు పూర్తి అన్యాయం జరిగిందని దుయ్యబట్టారు. కేటీఆర్‌కు మళ్లీ ఏసీబీ నోటీసులు ఇవ్వడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. మళ్లీ బీఆర్ఎస్ అధికారంలోకి రావడం ఖాయమన్నారు.

సంస్థ సమాచారం బయటకు చెప్పొద్దు


మాట్లాడుతున్న జీఎం లక్ష్మీనారాయణ

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణికి చెందిన ఎలాంటి సమాచారమైన, సెక్యూరిటీ, విజిలెన్స్ సమాచారం బయటికి చేరవేస్తే, ఇతర వ్యక్తులకు అందిస్తే కఠిన చర్యలు ఉంటాయని సింగరేణి సెక్యూరిటీ జీఎం లక్ష్మీనారాయణ పేర్కొన్నారు. ఈ మేరకు శనివారం కొత్తగూడెం కార్పొరేట్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ... హెడ్డాఫీస్ ప్రధాన గేట్, బంగ్లోస్ చెక్ పోస్టు, మెయిన్ హాస్పిటల్, ఎస్టేట్స్ విభాగాల్లో విధులు నిర్వహించే వారు అప్రమత్తంగా ఉండాలని, డ్యూటీ, హానర్ కోడ్‌లను కచ్చితంగా పాటించాలని సూచించారు. విధి నిర్వహణలో అంకితభావంతో పనిచేస్తూ సంస్థ ఆస్తులను కాపాడుతూ సంస్థకు పేరు తేవాలన్నారు. కంపెనీకి నష్టపరిచే సమాచారం తెలిస్తే, వెంటనే ఉన్నతాధికారులకు, సింగరేణి విజిలెన్స్‌కు సమాచారం ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేట్ ఎస్ఎస్ఓ జాకీర్ హుస్సేన్, సిబ్బంది పాల్గొన్నారు.

దేశాన్ని అగ్రగామిగా నిలిపేందుకు సహకరించాలి


కరపత్రాలు ఆవిష్కరిస్తున్న నాయకులు

కొత్తగూడెంఅర్బన్: ప్రపంచ చిత్రపటంలో భారతదేశాన్ని అగ్రగామిగా నిలిపేందుకు జరుగుతున్న ప్రయత్నంలో ప్రజలంతా సహకరించాలని బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు పైడిపాటి రవీందర్ తెలిపారు. శనివారం మండలాధ్యక్షుడు మాలోత్ గాంధీనాయ్ ఆధ్వర్యంలో శ్రీనగర్ పంచాయతీ జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ప్రధాని మోదీ 11 ఏళ్ల పరిపాలన పూర్తి చేసుకున్న సందర్భంగా సాధించిన విజయాలను కార్యకర్తలకు, శక్తి కేంద్ర ఇన్‌చార్జిలకు, నాయకులకు వివరించారు. కాంగ్రెస్ 50 ఏళ్లు సాధించలేనిది మోదీ సాధించి ప్రపంచ ఆర్థిక వ్యవస్థలోనే దేశాన్ని నాలుగో స్థానానికి తీసుకోచ్చారన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండలాధ్యక్షుడు గాంధీ, మండల ఇన్‌చార్జి కొడుకు శ్రీధర్ యాదవ్, నాయకులు చారి, రెడ్డెం నవీన్, వెంకన్న, ధనలక్ష్మి, కవిత, అరుణ, సంపత్ కుమార్, నాయకులు పాల్గొన్నారు.

'కేంద్ర పథకాలకు రాష్ట్ర ప్రభుత్వం బొమ్మలు'

పాల్వంచరూరల్: రాష్ట్రంలో కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలకు తాము అమలు చేస్తున్నట్లుగా రాష్ట్ర ప్రభుత్వం బొమ్మలు వేసుకుని ప్రచారం చేసుకోవడాన్ని ప్రజలు గమనిస్తున్నారని బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి పానిశెట్టి వెంకటేశ్వర్లు విమర్శించారు. పట్టణంలో శనివారం జిల్లా ముఖ్య నాయకుల సమావేశం నిర్వహించారు. రాష్ట్రంలో డబుల్ ఇంజన్ సర్కార్ రావాలని ప్రజలు కోరుకుంటున్నారని తెలిపారు. దున్నపోతుల రాజు, దాసరి రమేష్, సర్దార్ సురేశ్, బత్తుల వెంకటేశ్వర్లు, లక్ష్మణ్, ప్రశాంత్ పాల్గొన్నారు.

రాష్ట్ర మహాసభను జయప్రదం చేయండి


జూలూరుపాడు: పోస్టర్లు ఆవిష్కరిస్తున్న నాయకులు


ఇల్లెందు: మాట్లాడుతున్న రాజేందర్

ఇల్లెందు: మున్సిపల్ కార్మికుల జీతాలు ప్రభుత్వమే చెల్లించాలని టీయూసీఐ డిమాండ్ చేసింది. శనివారం ఇల్లెందు చంద్ర కృష్ణమూర్తి విజ్ఞాన కేంద్రంలో జరిగిన తెలంగాణ ప్రగతిశీల మున్సిపల్ వర్కర్స్ యూనియన్ జిల్లా కమిటీ సమావేశంలో అధ్యక్ష కార్యదర్శులు గురునాథం, రాజేందర్ మాట్లాడారు. ఈ నెల 21, 22 తేదీల్లో నిజామాబాద్‌లో జరుగుతున్న టీయూసీఐ రాష్ట్ర మహాసభకు అత్యధికంగా కార్మికులు తరలి వెళ్లి విజయవంతం చేయాలని కోరారు. నాయకులు మల్లెల వెంకటేశ్వర్లు, బత్తుల వెంకటేశ్వర్లు, మహేష్, భూలక్ష్మి, కుమార్, వెంకన్న, సదా, రఫీ, రాజమ్మ తదితరులు పాల్గొన్నారు.

జూలూరుపాడు: నిజామాబాద్ జిల్లా కేంద్రంలో జరిగే ట్రేడ్ యూనియన్ సెంటర్ ఆఫ్ ఇండియా (టీయూసీఐ) రాష్ట్ర మహాసభను జయప్రదం చేయాలని యూనియన్ జిల్లా ఉపాధ్యక్షుడు ఏదులాపురం గోపాల్‌రావు పిలుపునిచ్చారు. శనివారం స్థానిక కేజీబీవీ వర్కర్స్‌తో కలిసి ఆయన మహాసభ వాల్ పోస్టర్లను ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ... 21న కార్మికులతో భారీ ప్రదర్శన, బహిరంగ సభ జరుగుతుందన్నారు. 22న ప్రతినిధుల మహాసభ జరుగుతుందని ఈ మహాసభలో దేశంలో కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో అరుణ, రమాదేవి, స్వరూప, నిర్మల, సునీత, కల్యాణి, శిరీష, రజిత, ప్రవంతి, రాధ తదితరులు పాల్గొన్నారు.

నేడు కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ

సుజాతనగర్: ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు చేతుల మీదుగా తహసీల్‌లో ఆదివారం కల్యాణలక్ష్మీ, షాదీముబారక్ చెక్కులు పంపిణీ చేయనున్నట్లు తహసీల్దార్ కృష్ణప్రసాద్ ఒక ప్రకటనలో శనివారం తెలిపారు.

పెద్దమ్మతల్లి ఆలయంలో పూజలు


పూజలు నిర్వహిస్తున్న నాయకులు

పాల్వంచరూరల్: ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు జన్మదినాన్ని పురస్కరించుకుని సీపీఐ, కాంగ్రెస్ నాయకులు శనివారం మండల పరిధిలోని శ్రీ కనకదుర్గ (పెద్దమ్మతల్లి) ఆలయంలో ప్రత్యేక పూజలు చేయించారు. గంధం నర్సింహారావు, మాలోతు వీరన్న, ఆజ్మీర రమేష్, బి.రాము, బ్రహ్మచారి, నరేష్, రాము, ఆసిరామ్, నగేష్, బాలు, సురేష్, శ్రీను, సతీష్ పాల్గొన్నారు.

చేగువేరాకు నివాళి


నివాళులర్పిస్తున్న నాయకులు

జూలూరుపాడు: ప్రపంచ విప్లవకారుడు చేగువేరా జయంతిని జేపీఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో శనివారం జూలూరుపాడులో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా చేగువేరా చిత్రపటానికి జేపీఆర్ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు ఇడుపుల రాజు, కాంగ్రెస్ మైనార్టీ సెల్ నాయకుడు ఎస్‌కె.సమీర్‌లు పూలమాలలు వేసి నివాళులర్పించారు. నాయకులు మాడుగుల నాగరాజు, కడియాల నాగేశ్వరరావు, బుచ్చిబాబు, మాడుగుల నరేష్, చరణ్, ముజ్జు, తదితరులు పాల్గొన్నారు.

డ్యాన్స్ పోటీలు ప్రారంభం

ఇల్లెందు: పట్టణంలోని సీఈఆర్ క్లబ్‌లో శనివారం ఘనంగా రెండు తెలుగు రాష్ట్రాల స్థాయి డాన్స్ పోటీలు ప్రారంభమయ్యాయి. మున్సిపల్ మాజీ చైర్మన్ దమ్మాలపాటి వెంకటేశ్వరరావు, శివశక్తి సంస్థ దండు సారయ్య(సారిక)లు జ్యోతి ప్రజ్వలన చేసి పోటీలు ప్రారంభించారు. డాన్స్ పోటీలలో పాల్గొనే కళాకారులను డాన్స్ మాస్టర్ కడారి వెంకట్, అరుణ్‌కుమార్‌లు ఆహ్వానించారు. ఉదయం నుంచి రాత్రి వరకు ఆయా ప్రాంతాల నుంచి విచ్చేసిన డాన్స్ మాస్టర్లు, కళాకారులు తమ ప్రతిభను ప్రదర్శించుకున్నారు.


జ్యోతి ప్రజ్వలన చేసి పోటీలను ప్రారంభిస్తున్న డీవీ, తదితరులు

బాధ్యతగా రక్తదానం, అవయవదానం



మాట్లాడుతున్న నాగరాజు

సింగరేణి(కొత్తగూడెం): రక్తదానం, అవయవదానం చేయడం ప్రతీ ఒక్కరి బాధ్యతని డాక్టర్ నాగరాజు అన్నారు. ఈ మేరకు శనివారం కొత్తగూడెంలోని పాస్టాఫీస్ సెంటర్లో గల సింగరేణి ఉన్నత పాఠశాలలో యంగ్ ఇండియన్ బ్లడ్ డోనర్స్ క్లబ్ ఆధ్వర్యంలో రక్తదాతలకు సన్మాన కార్యక్రమం నిర్వహించారు. . తెలంగాణ గెజిటెడ్ ఆఫీసర్ అసోషియేషన్ జిల్లా అధ్యక్షులు సంఘం వెంకట పుల్లయ్య, జే.బాలు, లగడపాటి రమేషచంద్, యోగాగురువు సత్యనారాయణ, హెచ్‌ఎం పూల్‌సింగ్, ముజాహిద్దీన్, రాజేష్, సరిత, మునీలా, నిరంజన్, అజీమ్‌ఖాన్, హైమద్ తదితరులు పాల్గొన్నారు.

చెరువును తలపిస్తున్న రహదారి


సీసీ రోడ్డుపై నిలిచిన నీరు

టేకులపల్లి: మండలంలోని కొత్తతండా(పి) గ్రామంలో సీసీ రోడ్డు చెరువుగా మారింది. దీంతో రాకపోకలకు ఇబ్బందిగా మారింది. వర్షం పడినప్పుడల్లా ఈ రోడ్డుపై వరద నీరు నిల్వ ఉంటోంది. రోడ్డు నిర్మాణంలోనే లోపం ఉండటంతో ఈ సమస్య ఏర్పడింది. దీంతో కొత్తతండా(పి) మీదుగా వెళ్లే వాహనదారులు నానా తంటాలు పడుతున్నారు. పంచాయతీలో నిధులు లేకపోవడంతో రోడ్డు బురద గుంత సమస్యకు పరిష్కారం లభించడం లేదు. అధికారులు స్పందించి రోడ్డుపై బురద గుంత సమస్యను పరిష్కరించాలని స్థానికులు కోరుతున్నారు.

దశాబ్దాలుగా ఎదురుచూపులు..

- అస్తవ్యస్తంగా తూర్పుగూడెం–సులానగర్ రోడ్డు
- రోడ్డు నిర్మించాలని వాహనదారుల వేడుకోలు


వరదొస్తే మునిగిపోయే చప్టా



తూర్పుగూడెం–సులానగర్ అధ్వానంగా ఉన్న రోడ్డు

టేకులపల్లి: దశాబ్దాలుగా తూర్పుగూడెం నుంచి సులానగర్ వరకు రోడ్డు కోసం ఆదివాసీ గిరిజనులు ఎదురుచూస్తున్నారు. ప్రభుత్వాలు మారుతున్నా ఈ రోడ్డుకు మోక్షం లభించడం లేదు. తూర్పుగూడెం నుంచి సులానగర్ వరకు సుమారు ఐదు కిలోమీటర్లు ఉన్న రోడ్డు మట్టి, తేలిన కంకర, గుంతలతో ప్రమాదకరంగా మారింది. తూర్పుగూడెం నుంచి సులానగర్, కోయగూడెంతో పాటు కొత్తగూడెం వెళ్లాలంటే ఇదే మార్గం. అదేవిధంగా కోయగూడెం, సులానగర్, చింతలంక, బిల్లుడుతండా తదితర గ్రామాల ప్రజలు స్టేషన్ బేతంపూడి, సుజాతనగర్, ఏన్కూరు మీదుగా ఖమ్మం, సత్తుపల్లి తదితర గ్రామాలు, పట్టణాలకూ ఈ మార్గం గుండానే వెళ్లాల్సి ఉంటుంది. రోడ్డు సరిగా లేకపోవడంతో రాకపోకలు ఇబ్బందికరంగా మారాయి. వర్షాకాలం పరిస్థితి వర్ణనాతీతం. ఈ మార్గంలో ఉన్న చప్టా వర్షాకాలంలో వరదకు మునిగిపోతుంది. రహదారి అస్తవ్యస్తంగా ఉండటంతో ప్రయాణాలు చేయడమంటే భయపడుతున్నారు. ఇప్పటికే పలు ప్రమాదాలు కూడా జరిగాయి. ఉన్నతాధికారులు, పాలకులు స్పందించి తూర్పుగూడెం–సులానగర్ బీటీ రోడ్డు మంజూరు చేసి త్వరితగతిన పూర్తి చేయాలని స్థానికులు కోరుతున్నారు.

ఎదురుచూస్తున్నాం



తూర్పుగూడెం–సులానగర్ బీటీ రోడ్డు కోసం దశాబ్దాలుగా ఎదురు చూస్తున్నాం. రహదారిలో గుంటలు, తేలిన కంకరతో ఈ మార్గంలో ప్రయాణించాలంటే భయమేస్తోంది. ఇప్పటికే కొంతమంది అదుపు తప్పి కింద పడటంతో గాయాలు కూడా అయ్యాయి. ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి వెంటనే పక్కా రోడ్డు వేయించాలి.

– కంగల మంగయ్య, తూర్పుగూడెం

ప్రమాదకరంగా ప్రయాణం..



తూర్పుగూడెం–సులానగర్ మార్గం ప్రమాదకరంగా మారడంతో ప్రయాణాలు చేయాలంటే భయపడుతున్నారు. ఈ మార్గం అస్తవ్యస్తంగా ఉండటంతో రాకపోకలకు ఇబ్బందిగా మారింది. ఇల్లెందు ఎమ్మెల్యే కోరం కనకయ్య చొరవ తీసుకుని తూర్పుగూడెం–సులానగర్ రోడ్డుని మంజూరు చేయించాలని కోరుతున్నాం.

– బాదావత్ నాగేశ్వరరావు, తూర్పుగూడెం